తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## ఇరకం దీవికి బోటుపై..
# ఆ తర్వాత ట్రాక్టర్‌పై..
### పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ లక్ష్మీషా



తడ మండలం ఇరకం దీవికి పడవపై వెళుతున్న తిరుపతి జిల్లా కలెక్టర్ బృందం, ఇరకంలో ట్రాక్టర్‌పై దీవిని సందర్శించిన కొత్త కలెక్టర్ లక్ష్మీషా

తడ ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

చుట్టూ పులికాట్ సరస్సు నీళ్లతో నిండిన తడ మండలం ఇరకం దీవిని తిరుపతి జిల్లా కొత్త కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీషా మంగళవారం సందర్శించారు. అక్కడి రెండు పోలింగ్ స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. దీవిలో ప్రతిసారి ఎన్నికల సమయంలో పోలింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి తెలుసుకున్నారు. కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత లక్ష్మీషా తొలిసారి తడకు వచ్చి ఆ తర్వాత భీములవారిపాలెం చేరుకున్నారు. అనంతరం ప్రత్యేక బోటులో ఆయన సుమారు గంటసేపు ప్రయాణించి ఇరకం దీవికి వెళ్లారు. అక్కడ నడవడానికి సౌకర్యం లేకపోవడంతో గ్రామస్థులు ట్రాక్టర్ ద్వారా కలెక్టర్‌ను తమ దీవికి తీసుకెళ్లారు. ఇరకం ప్రధాన గ్రామంతో పాటు తిరువెంకటనగర్‌గా పేరుమార్చుకున్న పాలెంతోపు కుప్పంకు కూడా కలెక్టర్ బృందం వెళ్లింది. ఈ సందర్భంగా ఇరకంలో దశాబ్దాల నుంచి ఉన్న ప్రధాన సమస్యలను గ్రామస్థులు ఏకరువు పెట్టారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో పడుతున్న ఇబ్బందులు వారు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కుప్పం నుంచి సురక్షిత ప్రాంతానికి వెళ్లడానికి అనుకూలమైన ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీషా మాట్లాడుతూ ఈ దీవిలోని సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇరకం ప్రధాన గ్రామంలోని 291, పాలెంతోపుకుప్పంలోని 292 పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. ఎన్నికలు వస్తున్న కారణంగా పాఠశాల భవనాలు సక్రమంగా ఉంచుకోవాలని స్థానిక అధికారులు, సిబ్బందికి చెప్పారు. ఇందులో ప్రశాంతంగా పోలింగ్ జరిగేలా ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులతో అన్నారు. కలెక్టర్‌తో పాటు నాయుడుపేట డిఎస్పీ వి.శ్రీనివాసులురెడ్డి, సూళ్లూరుపేట సీఐ మధుబాబు, తడ ఎస్ఐ జెపి శ్రీనివాసరెడ్డి, స్థానిక తహశీల్దార్ సయ్యద్ ఇక్బాల్, ఎన్నికల ప్రత్యేక అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## బిల్లులు చెల్లించాలని నిరసన



కుప్పంలోని ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయంకు తాళాలు వేసి నిరసన తెలుపుతున్న వైకాపా నేతలు. 17కోట్ల బిల్లులు చెల్లించాలని నినాదాలు చేస్తున్న దృశ్యం

## రథసప్తమి పర్వదినం పురస్కరించుకుని
# 16న అన్ని ప్రత్యేక దర్శనాలు రద్దు
### వైకుంఠమ్ 2 నుండే ఆలయంలోకి ప్రవేశం -వాహనసేవల వీక్షణకు చక్కటి ఏర్పాట్లు







తిరుమల,ఫిబ్రవరి 13ప్రభాతవార్తప్రతినిధి:

రథసప్తమి పర్వదినం పురస్కరించుకుని 16వతేదీ శుక్రవారం ఆలయంలో అన్ని ప్రత్యేక దర్శనాలు టిటిడి అధికారులు రద్దు చేశారు. ఆ రోజు ఉదయం కేవలం ప్రోటోకాల్ పరిధి లోని ప్రముఖులకు మాత్రమే విఐపి బ్రేక్ దర్శనాలు కల్పిస్తారు. మిగిలిన సామాన్య భక్తులందరూ వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌ద్వారా ఆలయంలోనికి చేరుకోవాల్సి ఉంటుంది. 16న ఉదయం 5.30గంటల నుండి రాత్రి 9గంటల వరకు ఒకేరోజు ఏడువాహనాలపై శ్రీవారు ఊరేగనున్నారు. మాఢవీధుల్లో అవసరమైన ప్రాంతాల్లో షెడ్లు ఏర్పాటు చేశారు. కూల్‌పెయింటింగ్ వేశారు. ఆకట్టుకునేలా రంగవల్లులు తీర్చిదిద్దారు. గ్యాలరీల్లో వేచివున్న భక్తులకు నిరంత రాయంగా సాంబారు అన్నం, పెరుగుఅన్నం, పులిహోర,పొంగలి అన్నప్రసాదాలు, మజ్జిగ, టీ,కాఫీ, పాలు పంపిణీచేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 5.30 గంటలకు తొలి వాహనంగా సూర్యప్రభవాహనం మొదలై ఉదయం 8గంటల వరకు మాఢవీధుల్లో ఊరేగ నుంది. ఉదయం 9గంటల నుండి 10గంటల వరకు చిన్నశేషవాహనం, ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు గరుడవాహనం, మధ్యాహ్నం 1నుండి 2గంటల వరకు హనుమంతవాహనం, మధ్యాహ్నం 2గంటల నుండి 3గంటల వరకు చక్రస్నానం, సాయంత్రం 4గంటల నుండి 5వరకు కల్ప వృక్షవా హనం, సాయంత్రం 6గంటల నుండి 7వరకు సర్వభూపాల వాహనం, రాత్రి 8గంటల నుండి 9వరకు చంద్రప్రభవాహనసేవలు ఆలయ మాఢవీధుల్లో స్వామివారు ఊరేగనున్నారు.

## వాహనసేవల వీక్షణకు సాఫీ మార్గాలు
### -భక్తుల భద్రతే ముఖ్యమన్న ఎస్‌పి మల్లిక గార్గ్

తిరుమల,ఫిబ్రవరి 13ప్రభాతవార్తప్రతినిధి:



మరో 48గంటల్లో మొదలుకానున్న రథసప్తమి వాహనసేవల వీక్షణకు విచ్చేసే భక్తులు ఆలయ మాఢవీధుల్లో గ్యాలరీల్లోకి సాఫీగా చేరుకునేలా చూడాలని తిరుపతి జిల్లా ఎస్‌పి మల్లికాగార్గ్ సూచించారు.ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పార్కింగ్ ప్రదేశాలకు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. తిరుమలలో కంట్రోల్ రూమ్‌ద్వారా నిరంతరం పర్యవేక్షణ ఉంటుందన్నారు. మినీబ్రహ్మోత్సవమ్ పురస్కరిం చుకుని శుక్రవారం నాటి ఏర్పాట్లు, సౌకర్యాలపై మంగళవారం సాయంత్రం టిటిడి సివిఎస్ఒ నరసింహకిశోర్, తిరుపతి జిల్లా ఎస్‌పి మల్లికాగార్గ్, విఎస్ఒ నందకిశోర్, డిఎస్‌పి శ్రీనివాసా చారి, తిరుమల సిఐలు విజయకుమార్, సత్యనారాయణ, ఏవిఎస్ఒ సాయిగిరిధర్, విజిలెన్స్ సిబ్బందితో కలసి తిరుమలలో ఆలయ మాఢవీధులను పరిశీలించారు.

# ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుచానూరు, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త



పరదాల సెట్‌ను వితరణ చేస్తున్న భక్తురాలు స్వర్ణకుమారి

తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరు మంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఫిబ్రవరి 16న రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఉదయం 6.30 నుండి 9 వరకు చేపట్టారు. ఇందులో భాగంగా ఆలయ ప్రాంగణం, గోడలు, పై కప్పు, పూజాసామాగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీ గడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రమిశ్రమాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం సందర్భంగా మంగళవారం ఆలయంలో కళ్యాణోత్సవం, ఊంజల్ సేవలను రద్దు చేశారు. ఈ సందర్భంగా హైదరాబాదుకు చెందిన భక్తురాలు స్వర్ణకుమారి అందించిన పరదాల సెట్‌ను ఆలయంలో అలంకరించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శేషగిరి, అర్జిత ఇన్స్పెక్టర్ గణేష్, ప్రసాదం ఇన్స్పెక్టర్ ప్రసాద్, ఏవీఎస్ఓ శైలేంద్ర బాబు, విఐ రామమోహన్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# జోగివారిపల్లె పంచాయతీలో ఏనుగుల గుంపు సంచారం
### రైతుల పంటలు, చెరకు క్రషర్ ధ్వంసం



సదుం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

మండల పరిధిలోని జోగివారిపల్లె పంచాయతీలో ఏనుగుల దాడి జరిగింది. ఈ దాడిలో పలువురి పంటలు దెబ్బతిన్నాయి.వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలో గత కొన్నాళ్లుగా ఏనుగుల గుంపు తిరుగుతోంది. ఆ గుంపు ఈ మధ్య పులిచెర్ల మండలానికి వెళ్లి పోయి అక్కడ పంటలుధ్వంసం చేశాయి. అక్కడే ఉన్నాయిలే ఇక్కడికి ఇప్పట్లో రావులే అని రైతులు చెరకు గానుగలు సిద్ధం చేసుకుంటున్నారు. గానుగ ఆడి బెల్లం ఇళ్లకు చేర్చుకుందామని అనుకున్నారు. ఈక్రమంలో ఉన్నట్లుండి సోమవారం రాత్రి ఏనుగుల గుంపు వచ్చేసింది. జోగివారిపల్లె, చెరకువారిపల్లె పంచాయతీలలో కలియ దిరిగింది. మార్తువారిపల్లెకు చెందిన బుసగాని లోకనాథంకి చెందిన చెరకుక్రషర్‌ను, అదేవిధంగా పలురైతుల పంటలు ధ్వంసం చేశాయి. గానుగ ఆడేందుకు వేసుకున్న పందిరిలను పడదోశాయి. క్రషర్‌ను విరిచేశాయి. చెరకులను తిని వదలివెళ్లాయి.అక్కడే ఉన్న పెనాలను, పొయ్యిలను ధ్వంసం చేశాయి. దీనితో రైతుకు దాదాపు రూ.లక్ష మేర నష్టం వాటిల్లింది. అదేవిధంగా దగ్గరలోని రైతులకు చెందిన అరటి చెట్లను విరిచేశాయి. గానుగ కోసం మంగళవారం ఉదయం వచ్చిన రైతులు అక్కడ వాతావరణం చూసి భయపడ్డారు. ఎక్కడ తమ పైన దాడులు చేస్తాయోనని ఇళ్లకు వెళ్లిపోయారు. గానుగలు ఆడి బెల్లం ఇళ్లకు తరలించుకునందుకు అటవీ అధికారులు ఏనుగులనుంచి తమను కాపాడాలని ఈ సందర్భంగా సర్పంచి అనితాకుమారి, జేసీస్ మండల కన్వీనర్ నాలి ప్రకాష్‌రెడ్డిలు కోరారు.

## నాలుగువేల పూజలు: 117 అభిషేకాలు
### తగ్గని రద్దీ: 20 వేల మంది దర్శనం



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి ప్రభాతవార్త

ముల్లోకాల్ని ఏలే ముక్కంటీశుని దర్శనం కోసం దేశ నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి భక్తులు తండోపతండాలుగా వస్తున్నారు. మంగళవారం అధికారులు అందించిన సమాచారం మేరకు 20 వేలమంది దర్శనం చేసుకున్నట్లు అలాగే నాలుగువేల మంది రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకోగా భక్తి శ్రద్ధలతో జరిపించుకునే అభిషేకాలను 49 మంది 17 మహాన్యాసపూర్వక ఏకాదశ పూజలు జరిపించుకున్నట్లు ప్రకటించారు.సాధారణంగా శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి సోమవారం కర్నాటక, తమిళనాడు భక్తులు విశేష సంఖ్యలో వస్తారు.అధికారులు అందించిన సమాచారం మేరకు రూ.200ల దర్శన టిక్కెట్లు 1035,రూ.50ల దర్శనం టిక్కెట్లు 2082 అమ్ముడుపోయాయి. ఇక రాహుకేతుదోష నివారణ పూజలకు తండోపతండాలుగా భక్తులు కదలి వచ్చారు. 4వేల మంది రాహుకేతుదోష నివారణ పూజలుజరిపించుకున్నట్లు అధికారికంగా ప్రకటించారు.కేశ ఖండన 68 మంది జరిపించుకోగా సుమారు 20వేల ప్రసాదాలను విక్రయించారు.

## భక్తుల భద్రతకు ప్రాధాన్యత
### తిరుపతి జిల్లా నూతన ఎస్‌పి గార్గ్



తిరుమల,ఫిబ్రవరి 13ప్రభాతవార్తప్రతినిధి:

ప్రపంచంలో తిరుమల.తిరుపతి చాలా ప్రాముఖ్యమైన ఆధ్యాత్మిక ప్రాంతాలని, ఇక్కడ వేలాదిమంది యాత్రికులకు భద్రత కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తామని తిరుపతి జిల్లా నూతన ఎస్‌పి మల్లిక గర్గ్ తెలిపారు.తిరుపతి జిల్లా ఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన గర్గ్ మంగళవారం ఉదయం తొలిసారిగా తిరుమలకు వచ్చారు. కుటుంబసభ్యులతో కలసి ఆమె ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# చిత్తూరు 'దేశం' అభ్యర్థిత్వంపై క్లారిటీ!
### డికె ఆదికేశవులు కుమార్తె తేజేశ్వరీ వైపు 'దేశం' అధిష్టానంమొగ్గు!

చిత్తూరు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

చిత్తూరు అసెంబ్లీ తెలుగుదేశం అభ్యర్థిత్వంపై గత రెండు నెలలుగా సాగుతున్న సందిగ్ధతకు ఇప్పుడిప్పుడే క్లారిటీ కన్పిస్తోంది. టిటిడి మాజీ ఛైర్మన్ దివంగత డికె ఆదికేశవులు కుమార్తె తేజేశ్వరీ అభ్యర్థిత్వం వైపు తెలుగుదేశం పార్టీ అధిష్టానం మొగ్గు చూపుతుందనే సంకేతాలు ఇప్పుడు వెలువడుతున్నాయి. చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం నుండి 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేయడానికి పెద్ద సంఖ్యలో ఆశావాహులు సిద్ధం అయ్యారు. అయితే గత 20 సంవత్సరాలుగా చిత్తూరు నుండి తెలుగుదేశం అధిష్టానం బలిజ సామాజిక వర్గానికి చెందిన వారినే అభ్యర్థులుగా ఖరారు చేస్తోంది. ఈ సామాజిక వర్గం నుండి ఇప్పటికే తెలుగుదేశం పార్టీ తరపున ఎఎస్ మనోహర్, దివంగత టిటిడి మాజీ ఛైర్మన్ డికె ఆదికేశవులు సతీమణి దివంగత డిఎ సత్యప్రభలు ఎమ్మెల్యేలు పని చేశారు. రాష్ట్రంలో 2024లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని ఈ ఎన్నికల్లో ఎలాగైనా తమ సామాజిక వర్గానికి చెందిన వారిని చిత్తూరు నుండి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఖరారు చేసి విజయం సాధించాలని తెలుగుదేశం పార్టీలోని ప్రధాన సామాజిక వర్గ నేతలు వ్యూహాలు రచిస్తున్నారు. ఈ మేరకు ఇక్కడి నుండి ఈ సామాజిక వర్గం నుండి పోటీ చేయడానికి గురజాల జగన్మోహన్‌నాయుడుతో పాటు మాజీ తెలుగుదేశం జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ జడ్పీ ఛైర్‌పర్సన్ గీర్వాణీ భర్త చంద్రప్రకాష్‌లు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే చిత్తూరు అసెంబ్లీ స్థానంను మొదటి నుండి తెలుగుదేశం అధిష్టానం బలిజ సామాజిక వర్గానికి కేటాయిస్తుండటంతో ఈ సారి సైతం తమ సామాజిక వర్గానికి చెందిన వారినే అభ్యర్థిగా పార్టీ అధిష్టానం ఖరారు చేస్తోందని భావించిన జిల్లా తెలుగుదేశం ఉపాధ్యక్షులు కాజూరు బాలాజీ, మాజీ మేయర్ కఠారి హేమలతలు పార్టీ అభ్యర్థిత్వం కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇటీవల జిడినెల్లూరులో రా..! కదలిరా...! కార్యక్రమంలో మాజీ టిటిడి ఛైర్మన్ డిఎ ఆదికేశవులు కుమార్తె తేజేశ్వరీ హాజరై పార్టీ అధ్య క్షులు నారా చంద్రబాబును కలవడం, చిత్తూరులో మంగళవారం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఆమె పాల్గొని ప్రచారం చేయడంతో చిత్తూరు అభ్యర్థిత్వంపై తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలకు కొంత క్లారిటీ వచ్చినట్లు అయ్యింది.

# వైద్యాధికారి పవన్‌కుమార్‌కు బదిలీ వేటు

చౌడేపల్లి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

మండల వైద్యాధికారి పవన్‌కుమార్ బదిలీ అయ్యారు. " చౌడేపల్లి ఆసుపత్రికి జబ్బు చేసింది..."అన్న శీర్షికన వార్తలో కథనం ప్రచురితమైన విషయం విధితమే...స్పందించిన జిల్లా వైద్యాధికారిణి ప్రభావతి ఇటీవల ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. ఆసుపత్రిలో జరుగుతున్న పలు అంశాలను గురించి హెచ్‌డిఎస్ ఛైర్మన్ కె.కళ్యాణ్‌భరత్, సిబ్బంది, స్థానికులను వేరు వేరుగా ఆమె విచారణ జరిపారు. ఆసుపత్రిలోని పలు రికార్డులను తనిఖీ చేసారు. ఈక్రమంలో మంగళవారం వైద్యాధికారి పవన్‌కుమార్‌ను నగరికి బదిలీ చేస్తూ డిఎంహెచ్ఓ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలుబడ్డాయి. వీటిని ఆరోగ్య కేంద్రానికి రిజిష్టర్ పోస్టు ద్వారా పంపినట్లు సమాచారం. పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పూజకు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో 15రోజులుగా ఆసుపత్రిలో జరుగుతున్న నిశ్శబ్ద యుద్ధానికి ఎట్టకేలకు తెరబడిందని ఆరోగ్య సిబ్బంది, స్థానికులు అంటున్నారు.



విచారణ ఎదుర్కొని బదిలీ వేటుపడ్డ వైద్యాధికారి (వృత్తంలో) ఇన్‌సెట్‌లో వార్త కథనం

# కాసరంలో మెగా మట్టిమాఫియా!
### మట్టితవ్వకాల్లో బయటపడ్డ విలువైన రాళ్ళు
### చరవాణి ద్వారా పోలీసులకు సమాచారం -టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు





పోలీసులు స్వాధీనం చేసుకున్న టిప్పర్, టిప్పర్‌లో మట్టితో పాటు ఉన్న రాళ్ళు దృశ్యం

తొట్టంబేడు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

మండలంలోకి కాసరం గ్రామంలో మెగా మట్టిమాఫియా కొనసాగుతోంది.. ప్రభుత్వం రేణిగుంట నుంచి నాయుడుపేట వరకు ఆరులైన్ల రోడ్డు ఏర్పాటుచేస్తున్న విషయం విదితమే. ఈపనులను ప్రముఖ సంస్థ మెగా కంపెనీ చేపడుతోంది. ఇప్పటికే 50శాతంకు పైగా పనులు పూర్తయ్యాయి. అయితే పనులు చేసే సమయంలో వీరికి అవసరమైన మట్టిని చెరువుల నుంచి ఇష్టారాజ్యంగా తరలించడంతో చెరువులు లోతట్టుగా మారిపోతున్నాయి. దీంతో ఇటీవల శ్రీకాళహస్తి మండలంలోకూడా చెరువుల్లోని మట్టిని తవ్వేయడంతో లోతు తెలియకుండా దిగిన తల్లి చెరువులో పడిపోయింది. తల్లిని కాపాడడానికి వెళ్ళిన కుమార్తె కూడా చెరువులో దిగి మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. మండలంలోని కాసరం చెరువులో గత రెండు నెలల నుంచి మెగా కంపెనీకి చెందిన భారీ టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారు. కొందరు నాయకుల సాయంతో ఈ తతంగం సాగుతోంది. ఏ గ్రామంలో అయినా మట్టిని తరలించాలంటే ఆపంచాయతీకి రాయల్టీ చెల్లించాల్సిన అవసరం ఉంది. అయితే ఎలాంటి రాయల్టీని చెల్లించకుండా కొందరు నాయకులను అడ్డుపెట్టుకుని మట్టిని తరలిస్తున్నారు. మంగళవారం ఒటిప్పర్ నిండా మట్టితో పాటు తెల్లనిరాళ్ళు ఉన్నాయని గుర్తించిన స్థానికులు తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్రకు సమాచారం అందించారు. దీంతో ఆయన సిబ్బందిని పంపి టిప్పర్‌ను స్టేషన్‌కు తరలించారు. టిప్పర్‌లో మట్టితో పాటు పెద్దపెద్ద తెల్లనిరాళ్ళు ఉన్నాయి. మెగా పనుల కోసం కంపెనీ నిర్వాహకులు ఎక్కడ పడితే అక్కడ చెరువులు, కుంటల్లోని మట్టిని టిప్పర్ల ద్వారా మట్టిని తరలించేస్తున్నారు. గతంలోగుండేలి గుంట చెరువులో భారీ టిప్పర్లు పెట్టి మట్టిని తరలించారు. ప్రస్తుతం చెరువులో వర్షపునీరు చేరి ఎంత లోతు ఉందో కూడా తెలియలేని పరిస్థితి నెలకొంది. ఇక అసలు విషయానికి వస్తే మెగా కంపెనీ కాసరం చెరువులో మట్టి మాఫియా కొసాగుతోంది. ఇందులో విలువైన రాళ్ళు విలువ అంచనాకు మించి ఉంటుందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. బయపడిన రాళ్ళను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మైనింగ్ అధికారులు ఇవి ఏరాళ్ళని గుర్తించాల్సి ఉంది. విషయం తెలియగానే మెగా కంపెనీ ప్రతినిధి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని చర్చించారు. రోడ్డు పనులకు మట్టి అవసమే కానీ మట్టితో పాటు విలువైన రాళ్ళు ఏమిటో తెలియాల్సిన అవసరం ఉంది. దీనిపై తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్రను వివరణ కోరగా టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని రెవెన్యూశాఖకు అప్పగించామన్నారు. టిప్పర్లలో ఉన్న రాళ్ళు ఏమిటనేది తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ఏది ఏమైనా నిజానిజాలు తెలియాలంటే పోలీసులు రెవెన్యూ సిబ్బంది గ్రామానికి చేరుకుని పరిశీలించాలని తెలిపారు. అంతేకాకుండా సాయంత్రం ఒటిప్పర్ ద్వారా మట్టిని తరలిస్తుండడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు.

# నేరాల నియంత్రణే లక్ష్యం :ఎస్పీ జాషువా

గంగాధర నెల్లూరు ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:



నేరాల నియంత్రణే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ జాషువా అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ను ఆయన తనిఖీ చేశారు జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తొలిసారిగా పోలీస్ స్టేషన్‌కు రావడంతో సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.అనంతరం ఆయన పలు రికార్డులను సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు జిల్లాలో రెండవ పెద్ద మండలం కావడంతో పోలీస్ స్టేషన్‌ను ఎస్ఐ స్థాయి నుండి సిఐ స్థాయికి అప్‌గ్రేడ్ చేయడం జరిగింది. దీనివల్ల ఫిర్యాదు కోసం వచ్చే వారికి వెసులుబాటుగా ఉంటుందని త్వరగా న్యాయం జరిగి అవకాశం ఉంటుందని అన్నారు. అలాగే ఎన్నికలు సమీపిస్తుండడంతో రాత్రి గస్తీలు తిరగడం వహానాల తనిఖీలను ముమ్మరం చేయాలన్నారు.అలాగే పాత నేరస్తుల రౌడీషీటర్లపై నిఘా పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ రాజగోపాల్ రెడ్డి,స్పెషల్ బ్రాంచ్ సిఐ గంగిరెడ్డి, స్థానిక సిఐ శంకర్ ఎస్ఐ రామాంజనేయులులతో పాటు పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణే ధ్యేయం - ఎస్పీ జాషువా

నగరి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:



ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణే ధ్యేయమని ఎస్పీ జాషువా అన్నారు. మంగళవారం రాష్ట్ర సరిహద్దు తడుకుపేట వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన పరిశీలించారు. తనిఖీలు ఎలా చేయాలో సిబ్బందికి నిశితంగా వివరించారు. అలసత్వం చూపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిపేందుకు అనుగుణంగా విస్తృత బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం ప్రలోభాలను అడ్డుకట్ట వేసేలా ప్రణాళికలు రచించామన్నారు. అసాంఘిక శక్తుల కదలికపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు ఇప్పటికే పోలీసుశాఖ కనుసన్నల్లోకి తీసుకుందన్నారు. నిరంతరసోదాలుజరుగుతున్నాయన్నారు. ఒక్కొక్క చెక్‌పోస్టులో పటిష్టమైన సిబ్బందిని ఏర్పాటు చేశామని వారు మూడు షిఫ్టులు పని చేస్తారన్నారు. ఎస్‌బీ సీఐ గంగిరెడ్డి, సీఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మైక్రో లెర్నింగ్‌సెంటర్‌పై అవగాహన

**నగరి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:** స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులకు మంగళవారం కామన్‌వెల్త్ ఆఫ్ లెర్నింగ్ కెనడా వారి సహకారంతో రైతులకు వివిధ పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ తరపున విచ్చేసిన టీం లీడర్ పి.తమిజోళి, ఆప్‌కాబ్ మైక్రో లెర్నింగ్ సెంటర్ టీం లీడర్ కె.మస్తాన్‌రావు రైతులకు మైక్రో లెర్నింగ్ సెంటర్ యాప్‌పై అవగాహన ఏర్పరచారు. ఈ యాప్‌ని 54 దేశాల్లో వినియోగిస్తున్నారని మన దేశంలోను రైతుల కోసం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. దీని ద్వారా రైతులు సజ్జ, చెరకు, వేరుశనగ, వరి లాంటి పంటల సాగు చేయడంతో పాటు ఈ పంటల్లో వచ్చే తెగుళ్ళ నివారణకు ఏ మందులు పిచికారి చేయాలి, ఎంత మోతాదులో చేయాలనే అంశాలపై అవగాహన పెంచుకోవచ్చన్నారు. సందేహాలను అందులోని ఫోన్ నెంబర్లకు సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో స్టాఫ్ అసిస్టెంట్ అర్షియా రహమత్, చిత్తూరు పీడీసీ సేల్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వ్యవసాయ అధికారి రాఘవేంద్ర యాదవ్, సంఘ అధ్యక్షులు తిరుమలరెడ్డి, సీఈవో తులసిపిళ్లై, సూపర్‌వైజర్ ఆనంద్, శేఖర్, కార్తీక్ పాల్గొన్నారు.

## బలిజలకు వైసిపి మొండిచేయి

రానున్న ఎన్నికలలో వైసిపికి బలిజలు తగిన మూల్యం

రాష్ట్ర బలిజ నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్



తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త

తిరుపతి తిలక్ రోడ్డులోని ప్రెస్ క్లబ్‌లో మంగళవారం రాష్ట్ర బలిజ నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ప్రస్తుత వైసిపి పార్టీ బలిజల పట్ల అవలంబిస్తున్న తీరును ఎండగడుతూ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బలిజ నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గ్రేటర్ రాయలసీమలో ఒక్క సీటును కూడా కేటాయించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేసారు. గత ఎన్నికలలో అధిక శాతం జనాభా కలిగిన బలిజలకు వైసిపి పార్టీ కేవలం రెండు సీట్లను చిత్తూరు, దర్శి మాత్రమే కేటాయించారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ రెండు సీట్లను కూడా వైసిపి తమ సామాజికవర్గానికే కట్టబెట్టడం మంచిపద్ధతి కాదని పేర్కొన్నారు. తరువాత బలిజ నాయకులు కృష్ణయ్య మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రిజర్వేషన్ అంశం ఈడబ్ల్యూఎస్ కింద 10 శాతం రిజర్వేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నాగాని గత తేదేపా ప్రభుత్వం ఇచ్చిన హామీని ప్రస్తుత వైసిపి ప్రభుత్వం బలిజలపై అక్కసుతో కేటాయించకపోవడం దారుణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బలిజ నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, చింతకాయల కృష్ణయ్య, బెల్లంకొండ సురేష్, రాజేంద్ర, రామారావు, బాసికర్ల రఘు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌టియు డివిజన్‌లో శ్రీకాళహస్తి నాయకులకు ప్రాధాన్యం

.శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త




ఎస్‌టియు తిరుపతి జిల్లా కార్యవర్గంలో శ్రీకాళహస్తి డివిజన్ ఉపాధ్యాయులకు ప్రాధాన్యత లభించింది. జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శిగా పెరిమిడి దేవేంద్ర(బిఎన్‌కండ్రిగ), అసోసియేట్ అధ్యక్షులుగా శేషయ్య (వరదయ్యపాళెం), మద్దూరు లక్ష్మయ్య(బిఎన్‌కండ్రిగ), గుమ్మడిమురళీ(బిఎన్‌కండ్రిగ), ఉపాధ్యాయులు తొండు కృష్ణయ్య(తొట్టంబేడు), శ్రీనివాసులు (శ్రీకాళహస్తి) కార్యదర్శులుగా చింతపూడి శారదమ్మ(బిఎన్‌కండ్రిగ), చంద్రశేఖర్(కెవిబిపురం), మైనార్టీ కన్వీనర్‌గా ఎం. ముజీబ్(వరదయ్యపాళెం), ఆర్థిక కమిటీ సభ్యులుగా శ్యాంసుందర్(వరదయ్యపాళెం), సిపిఎస్ కన్వీనర్‌గా శ్రీహరి(కెవిబిపురం), సాంస్కృతిక కమిటీ కన్వీనర్‌గా పోలూరు జగన్నాథం(బిఎన్‌కండ్రిగ), రాష్ట్ర కౌన్సిలర్‌గా యువశ్రీ మురళీకి శ్రీకాళహస్తి డివిజన్‌కి ప్రాధాన్యత ఇచ్చినందుకు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు ధన్యవాదాలు తెలిపారు.

## రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడుగా వెంకటాద్రి



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

ఏపిటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడుగా కె.వెంకటాద్రి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని సరస్వతీబాయి పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో ఎపిటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడుగా ఆంగ్ల ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న కె.వెంకటాద్రిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా వెంకటాద్రి మాట్లాడుతూ ఉపాధ్యాయ విద్యారంగ సమస్యల పరిష్కారానికోసం కృషిచేస్తానని తెలిపారు. తిరుపతి జిల్లా ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి బి.బాలసుబ్రమణ్యం, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడుగా ఎన్నికైన వెంకటాద్రికి శుభాకాంక్షలు తెలిపారు.

## జేఈఈ మెయిన్స్ సీజన్-1లో ఎంజిఎం విద్యార్థుల సత్తా

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

జేఈఈ మెయిన్స్ సీజన్-1లో సత్తా చాటిన ఎంజిఎం జూనియర్ కళాశాల విద్యార్థులు తమ సత్తా చాటినట్లు విద్యాసంస్థల డైరెక్టర్ గుడ్లూరుమయూర్ తెలిపారు. జనవరిలో నిర్వహించిన 2024లో నిర్వహించిన జాతీయ స్థాయి జేఈఈ మెయిన్స్ ఎంట్రన్స్ పరీక్షలో 2024 సెషన్-1లో ఎన్‌టిఏ ఫలితాల్లో అత్యధిక పర్సంటైల్ సాధించి పట్టణంలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్న ఎంజిఎం విద్యార్థులు వి.వినయ్ 94.36675, ఎస్.యుగంధర్‌రెడ్డి 91.933029, బి.మేఘన 80.55776తో పాటు ఆర్ వినీషా, భాగ్యశ్రీ, కె.హేమంత్, బి.మునిసాయి కుమారి అర్హతలు సాధించారు. ఉత్తమ ఫలితాలను సాధించిన వారికి సహకరించిన అధ్యాపకులకు డైరెక్టర్ గుడ్లూరు మయూర్ మరియు ప్రిన్సిపల్ విఎస్.రత్నం విద్యార్థులను వారి తల్లిదండ్రులను అభినందించారు.

## అనుబంధ ఆలయాలకు కుంభాభిషేకాలకు అంకురార్పణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయాలుగా వెలసిన మార్కండేయ తీర్థం, వేయిలింగాలకోన, దుర్గేశ్వరస్వామి ఆలయం, ఈటిసి కేంద్రంలో ఉన్న శివాలయాలకు కుంభాభిషేకం నిర్వహించేందుకు అంకురార్పణ కార్యక్రమాలను మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులు, సభ్యులు మరియు దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన సచివాలయాలను ప్రారంభించిన ఎమ్మెల్యే భూమన

తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త



తిరుపతి నగరంలో నూతనంగా నిర్మించిన సచివాలయాలను మంగళవారం టిటిడి ఛైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనగా, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అధితి సింగ్, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అధితి సింగ్ మాట్లాడుతూ 27వ డివిజన్‌కి సంబంధించిన రెండు సచివాలయాలను మల్లయ్యగుంట కట్ట వద్ద 62.70 లక్షలతో నిర్మించడం జరిగిందని, అదే విధంగా 44వ డివిజన్ రైల్వే కాలనీ వద్ద 25 లక్షలతో నిర్మించిన మరో నూతన సచివాలయంను కూడా ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రజా అవసరాలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు మున్సిపల్ కార్పొరేషన్ తగు చర్యలు తీసుకుంటున్నట్లు మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అధితి సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో 44వ డివిజన్ కార్పొరేటర్ వరికుంట్ల నారాయణ, కార్పొరేటర్ తిరుపతి మునిరామిరెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, ముదూరు మునిరామిరెడ్డి, జల్లి తులసీ యాదవ్, దొడ్డారెడ్డి శంకర్ రెడ్డి, చింతా రమేష్ యాదవ్, చింతా భరణీ యాదవ్, దొడ్డారెడ్డి మునిశేఖర్ రెడ్డి, నాగిరెడ్డి, స్టోర్ నాధమున్ని, దినేష్ రాయల్, శ్యామల, గీత, డిఈలు రాజు, శ్రావణి, కాంట్రాక్టర్లు అరున్ కుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్‌లో తిరుపతి ఆకాష్ విద్యార్థుల ప్రభంజనం

**తిరుపతి (క్రీడా), ఫిబ్రవరి 13, ప్రభాతవార్త** తిరుపతి ఆకాష్ విద్యా సంస్థల ద్వారా జేఈఈ పరీక్షలకు హాజరైన పలువురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తిరుపతి ప్రాంతానికి తగిన గుర్తింపు తెచ్చారని ఆకాష్ బైజూస్ విద్యా సంస్థల సీనియర్ అకాడమిక్ డైరెక్టర్ సిహెచ్ విజయ్ కుమార్, రీజనల్ సేల్స్ హెడ్ ఎం భరత్ కుమార్ పేర్కొన్నారు. ఆకాష్ విద్యా సంస్థలకు చెందిన రిషి శేఖర్ శుక్ల 300/300 మార్కులు సంపాదించి 100 శాతం పర్సంటైల్ సాధించి తెలుగు రాష్ట్రాలలో ఆకాష్ పేరును చిరస్థాయిగా నిలిపాడని ఈ సందర్భంగా వెల్లడించారు. తిరుపతి బ్రాంచ్ నుంచి ఆర్ రిత్విక్ 99.34, కేజై చంద్రారెడ్డి 99.11, ఎం. శివ చరణ్ 98.69 పర్సంటేజ్‌ను సాధించి ఉత్తమ ప్రతిభను కనబరిచారని పేర్కొన్నారు.వారిని ఘనంగా సత్కరించి అభినందించారు. బ్రాంచ్ హెడ్ మోద నరసిం హులు, బ్రాంచ్ ఇంజనీరింగ్ అకాడమీ హెడ్ శ్రీరామ రమేష్, తిరుపతి గీతం విద్యాసంస్థల చైర్మన్ తమ్మినేని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొని వారిని అభినందించారు. శత శాతం ఫలితాలు సాధించిన రిషి శుక్లాను ఆకాష్ ఎడ్యుకేషన్ సర్వీస్ లిమిటెడ్ రీజినల్ డైరెక్టర్ ధీరజ్ మిశ్రా సత్కరించి అనంతరం మాట్లాడుతూ జేఈఈ మెయిన్స్‌లో తమ విద్యార్థుల అత్యంత ప్రతిభ కనబరిచి తమ ప్రాభవం చాటుకున్నారని తెలిపారు.

## తల్లిదండ్రులు గర్వించే రీతిన చదవండి..!

చెవిరెడ్డి జ్ఞానేష్



రామచంద్రాపురం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

తల్లిదండ్రులు గర్వించే విధంగా విద్యార్థులు చదవాలని వైసిపి యువ నాయకుడు చెవిరెడ్డి జ్ఞానేష్ అన్నారు. మంగళవారం నెత్తకుప్పం, అనుప్పల్లి, పుల్లమనాయుడు కండ్రిగ, పిళ్ళారికోన, తిమ్మరాజుపల్లి, తదితర పాఠశాలలో విద్యార్థులకు ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వితరణ గావించిన నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఏ.వి.బ్రహ్మానందరెడ్డి, జడ్పీటిసి ఢిల్లీరాణి భానుకుమార్ రెడ్డి, వైస్ ఎంపిపి లావణ్య చంద్రబాబు, సర్పంచ్ హిమాల్ రెడ్డి, ఎంపిటిసిలు రాజేష్, మంజుల సిద్దారెడ్డి, వైసిపి పంచాయతీ కన్వీనర్లు సాయి శశికాంత్, శిరిపిరెడ్డి కేశవులు రెడ్డి, నాయకులు యశ్వంత్ రెడ్డి, బీకిరెడ్డి, ప్రసాద్, ఆంజనేయులు, మోహన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ కిందపడి యువకుడు మృతి

చంద్రగిరి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:

తొండవాడ జగనన్న కాలనీ వద్ద మంగళవారం జరిగిన ప్రమాదంలో బాలాజీ (18) ట్రాక్టర్ క్రింద పడి మరణించాడు. ఎస్ఐ అనిత వివరాల మేరకు.. తిరుపతి రూరల్ మండలం, పాతకాల్వకు చెందిన వరదారెడ్డి, తన కుమారుడు బాలాజీతో కలసి పిచ్చినాయుడుపల్లి నుండి జగనన్న కాలనీకి కంకరను తరలిస్తున్నారు. ఈ క్రమంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వరదా రెడ్డి మార్గ మధ్యలో ట్రాక్టర్‌ను ఆపి వెళ్ళాడు. ఈ క్రమంలో ఊహించని రీతిలో ట్రాక్టర్ ముందుకు కదలడంతో అదుపు తప్పిన బాలాజీ వెనుక ట్రాలీ చక్రాల క్రింద పడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేశారు.

## శివయ్య సేవలో శ్రీసిటి విద్యార్థులు:

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 13 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరుని ప్రాశస్త్యం,చరిత్రను విద్యార్థులకు అవగాహన కల్పించుటకు జిల్లాలోని ఉపాధ్యాయులు చొరవ చూపుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం చిన్మయ విద్యాలయానికి సంబంధించిన సుమారు 50 మంది విద్యార్థులతో ఉపాధ్యాయులు వచ్చారు. వారికి శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మ కర్తల మండలి అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు అడుగడుగునా ఆలయానికి సంబంధించిన చరిత్రను వివరించారు. స్వామి అమ్మవార్ల విగ్రహాల కు సంబంధించిన చరిత్రను వివరించారు.

## కోట్లు విలువైన భూమిపై రియల్టర్ల కన్ను

తొట్టంబేడు, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త



చెన్నై-బసవయ్యపాళెం లింకు రోడ్డు సమీపంలో ఏరియా ఆసత్రికి వెళ్ళే మార్గంలో ప్రభుత్వ కాలువ పోరంబోకు భూమి ఉంది. ఈభూముల విలువ కోట్లు రూపాయల్లో ఉంటుంది. గతంలో ప్రభుత్వ భూములుగా ఉన్నవి ప్రస్తుతం రియల్ వ్యాపారుల చేతుల్లోకి వెళ్ళిపోతున్నాయి. రెవెన్యూ అధికారులు రియల్ వ్యాపారుల నుంచి భారీగా ముడుపులు తీసుకుని ఆన్‌లైన్‌లో ఎక్కించేసినట్లు బాహాటంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత మూడు రోజుల క్రితం సర్వేనంబర్ 52లో ఉన్న భూముల్లో కేవలం 0.40 సెంట్లు మాత్రమే ఆక్రమణలు అని తేల్చిచెప్పిన అధికారులు ఈభూముల్లో బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. గతంలో ఇక్కడ ఓపార్కు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన కూడా ఉండేది. గతంలో ఉన్న ఓతహాశీల్దార్ ఈభూములను సబ్‌డివిజన్లుగా మార్చి ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఈసర్వేనంబర్ 52/1లో 0.28, 52/1ఎలో 0.2, 52/1బి, 53/1ఎ, 54/1ఎ, 54/1బి, 55/1ఎలో 1.51 ఎకరాలు సర్వేనంబర్ 52/డి, 52/సి, 54/సి, 55/బిలో 1.10 ఎకరాలు, 52/1సిలో 0.30సెంట్లు ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఇక్కడి స్థలంలో సరిహద్దురాళ్ళను కూడా సిద్ధం చేశారు. బైపాస్‌రోడ్డుకు పక్కనే ఉన్న కాలువ పోరంబోకు స్థలంలో కోట్లు విలువైన భూములపై రియల్ వ్యాపారులు కన్నేశారు. దీనిపై అధికారులు ఏలాంటి చర్యలుతీసుకుంటారో వేచి చూడాల్సిందే.

## చెత్తపై పన్ను: మద్యపాన నిషేధం మిధ్య

రిషితారెడ్డి విమర్శ

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 13 ప్రభాతవార్త



గతంలో పరిపాలించిన తెలుగుదేశం ప్రభుత్వం ఎప్పుడైనా చెత్తపై పన్ను వేసామా? విద్యుత్ చార్జీలు ఇబ్బడి ముబ్బడిగా వడ్డించామా? అని తెలుగుదేశం శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్‌చార్జి బొజ్జల రిషితారెడ్డి ప్రశ్నించారు. మంగళవారం శ్రీకాళహస్తి మండలంలోని మేలచ్చూరు,కాళంపల్లి,గుండ్ల పల్లి, కల్వకుంట గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు.ఈ సందర్భంగా ఆమె జనం ఎదుర్కొంటున్న సమస్యలను ఉటకిస్తూ ప్రసంగించారు. ఆమె రైతుల్ని ఉద్దేశించి మాట్లాడుతూ రైతుల పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేదు. ప్రకృతి కోపించి నష్టపరిస్తే ముఖ్యమంత్రి రెడ్ తివాచీలమీద పర్యటిస్తారు. ఇదీ నేటిప్రభుత్వ పరిస్థితి. శ్రీకాళహస్తి మండలంలో రైతులకు ఎంతో ఉపయోగపడే ఎస్ ఎస్ కాలువకు సంబంధించి అధికారంలో లేనపుడు శ్రీకాళహస్తినాయకుడు పాదయాత్రలు జరిపారు. మన్నవరం ప్రాజెక్టుకు సంబంధించి పెద్ద పెద్ద ఉపన్యాసాలు ఇచ్చారు. మరి అధికారంలోకి వచ్చి ఐదేళ్ళు గడిచాయి కదా మరి ఏం చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆమెతో పాటు క్లస్టర్ ఇన్‌చార్జి రంగినేని చెంచయ్యనాయుడు, రఘునాథ్‌రెడ్డి, దేశిరెడ్డి, మాజీ మార్కెటింగ్ కమిటి ఛైర్మెన్ చెలికం పాపిరెడ్డి, బత్తిరెడ్డి, తాటిపర్తి రవీంద్రనాథ్‌రెడ్డి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రచారంలో దూసుకువెళ్తున్న బిజెపి నేతలు

శ్రీకాళహస్తి/తొట్టంబేడు/శ్రీకాళహస్తి రూరల్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త



బిజెపి రాష్ట్రఅధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మరియ రాష్ట్ర కార్యదర్శి నియోజకవర్గ పార్టీ కో కన్వీనర్ కోలా. ఆనంద కుమార్ సూచనలతో పట్టణంలోని భాస్కరపేట పోలింగ్‌బూత్‌లో పట్టణ అధ్యక్షులు గరికపాటి రమేష్‌బాబు ఆధ్వర్యంలో బిజెపి నేతలతో కలసి గడపగడపకు వెళ్ళి ఓటర్లకు కేంద్ర ప్రభుత్వ నరేంద్రమోదీ సంక్షేమ పథకాలను వివరించారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోను మరియు శ్రీకాళహస్తి నియోజకవర్గంలోను విజయం మాదే అంటే కమలనాథులు ఓటరు చుట్టు తిరుగుతూ కమలం గుర్తుకు ఓటు వేసి అవినీతి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు గుర్తించి దేశంకోసం మరొక్కమారు బిజెపిని గెలిపించాలని కోరారు. కాగా తొట్టంబేడు మండలంలో మండల పార్టీ అధ్యక్షుడు వేదాం కృష్ణయ్యతో పాటు కార్యకర్తలు కలసి చోడవరం పంచాయతీలో పర్యటించారు. కాగా పానగల్, ఊరందూరు రోడ్డు మార్గం నుంచి రైల్వేస్టేషన్ రోడ్డు వరకు ప్రచారం నిర్వహించారు. కాగా కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కో కన్వీనర్ మేళాగారంసుబ్రమణ్యంరెడ్డి, ఓబిసి మోర్చా పట్టణ అధ్యక్షుడు కన్నావెంకటేశ్వర్లు, పట్టణ ఉపాధ్యక్షుడు గోపాల్, పట్టణ ప్రధాన కార్యదర్శి వాసుయాదవ్, బిజెపి నేతలు జివిఅమర్‌నాథ్, మోహన్‌రావు, గిరిధర్‌సాయి, నాని తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ పల్లెకు పోదాం కార్యక్రమం

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 13, ప్రభాతవార్త



తిరుపతి జిల్లా నారాయణవనం మం డలం పరిసర గ్రామాలలో గ్రామాలకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర భాజాపా అధ్యక్షురాలు పురందేశ్వరి ఆదేశాల మేరకు గిరిజన మోర్చ అధ్యక్షులు బి. గుండాల నాయక్ తంజా మోహన్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. 2014 తర్వాత బిజెపి ప్రభుత్వం అవినీతి రహిత భారతదేశానికి పునాది వేసిందని గ్రామస్తులతో అన్నారు. తర్వాత రాష్ట్రంలో కోట్ల మంది దారిద్ర రేఖ నుంచి బయటపడ్డారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన పథకం ద్వారా రాష్ట్రంలో 2.68 కోట్ల మందికి ఉచిత రేషన్ అందించారు. రాష్ట్రంలో 1.32 కోట్లకు పైగా పేదలకు జన్ ధన్ ఖాతాల ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థకు అనుసంధానం, డైరెక్ట్ బెనెఫిట్ ట్రాన్స్‌ఫర్‌లో భాగంగా 2019 - 2024 వరకు రాష్ట్రంలోని లబ్ధిదారుల ఖాతాల్లో రూ. 22061 కోట్ల రూపాయిలు జమ చేయడం జరిగిందన్నారు. ఉజ్వల పథకం ద్వారా రాష్ట్రంలో 512466 పైగా ఉచిత ఎల్‌పిజి కనెక్షన్లు, స్వచ్ఛ భారత్ ద్వారా 4239300 మరుగుదొడ్లు నిర్మించబడ్డాయి. సుకన్య సమృద్ధి యోజన పతకం కింద మన రాష్ట్రంలో 1531213 పైగా ఖాతాలు తెరవబడ్డాయన్నారు. ప్రధాన మంత్రి స్వానిధి యోజన పథకం కింద మన రాష్ట్రంలో 259479 మంది వీధి వ్యాపారులకు రుణ సదుపాయం పొందారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు నారాయణవనం మండలం అధ్యక్షుడు, కార్యకర్త కుమరేషన్, సురేష్, కైలాసం, దొర, బాలు, అన్ను, మురళీకృష్ణ పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## విద్య అందరికీ అవసరం

- పుస్తకాల పంపిణీలో తుడ ఛైర్మన్ మోహిత్‌రెడ్డి



తిరుపతిరూరల్, ఫిబ్రవరి13 ప్రభాతవార్త:

సంపదను దొంగలిస్తారేమో గానీ....విద్య అనేజ్ఞానాన్ని మాత్రం ఎవ్వరూ దొంగిలించలేరని, సమాజం ప్రతి ఒక్కరికీవిద్య అవసరమని తుడ ఛైర్మెన్, వైకాపా చంద్రగిరిఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. మంగళ వారం తిరుపతిరూరల్ మండలంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌పు స్తకాలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ అజ్ఞా నం అనే అంధకారాన్ని తొలగించి, జ్ఞానజ్యోతిని వెలిగించేందుకు విద్య దోహ దపడుతుందని తెలిపారు. తిరుపతిరూరల్లో తుమ్మలగుంట, వేదాంతపురం, ముండ్లపూడి, పాడిపేట, బ్రాహ్మణపట్టు,తిరుచానూరు, మంగళం గ్రామ పంచాయతీలలో పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## తెదేపాతోనే యర్రావారిపాలెం అభివృద్ధి

యర్రవారిపాళెం, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త



యర్రావారిపాలెం అభివృద్ధి జరగాలంటే తెలుగు దేశం అధికారంలోకి రావాలని తెలుగుదేశం నాయకుడు పులివర్తి వినిల్ అన్నారు. మంగళ వారం యర్రా వారిపాలెం మండలం కోటకాడ పల్లి పంచాయతీలో బాబు ష్యూరిటి భవిష్యత్ గ్యారెంటి కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా వినిల్ మాట్లాడుతూ ఇక్కడ ఎమ్మెల్యే ఏనాడో ప్రజా సమస్యపై దృష్టి పెట్టలేదని ఆరోపించారు. అనంతరం వేములవాడ, చెంఆవాండ్లపల్లె, విఆర్‌కాలనీ, అయ్యగారిపల్లెతడికిల చేనుపల్లి, బుట్టావానికుంట తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి - ఏఐటీయూసీ

పుత్తూరురూరల్, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:



పుత్తూరులో 16న జరిగే భారత్‌బంద్ పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని జాయింట్ ప్లాట్‌ఫాంఆఫ్ యూనియన్స్ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం)లు ఇచ్చిన పిలుపును జయప్రదం చేయాలని ప్రజా సంఘాలు ముద్రించిన కరపత్రాలను పుత్తూరులో విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ భవన నిర్మాణ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి శ్రీరాములు, జిల్లా సమితి సభ్యులు మహేష్, హైమావతిలు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ కేంద్రంలో రెండవ దఫా అధికారంలోకి వచ్చిన మోదీ బ్రిటీష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న 44కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడంతో కార్మికులు సమ్మె చేసే హక్కు కోల్పోతున్నారన్నారు. 16 డిమాండ్లతో కూడిన ఈ సమ్మె భారత్ గ్రామీణ బంద్‌ని యావత్తు కార్మిక వర్గం రైతాంగం వ్యవసాయ కూలీలు రోడ్లపైకి వచ్చి 16వ తేదీన జరిగే సమ్మెను జయప్రదం చేయాలని వారు కోరారు. ఏఐటీయూసీ జిల్లా ఆఫీస్ బేరర్ చంద్రబాబు, నాయకులు పుత్తూరు పట్టణ కార్యదర్శి చిరంజీవి, శరవణక్, చెంగయ్య, చంద్రశేఖర్, కృష్ణారెడ్డి, హైమావతి,ధన,మారమ్మ,భారతి పాల్గొన్నారు.

## గంగమ్మ సేవలో టిటిడి ఛైర్మన్ భూమన

తిరుపతి,ఫిబ్రవరి 13ప్రభాతవార్త:



తాతయ్యగుంటగంగమ్మను మంగళవారం ఉదయం టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయంకు విచ్చేసిన ఆయనకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. నగరపాలకసంస్థ మేయర్ డాక్టర్ ఆర్.శిరీష, నగరపాలక కమిషనర్ అదితితో కలసి గంగమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## తెలుగుయువత నేతలకు బెయిల్

తిరుపతి,ఫిబ్రవరి 13ప్రభాతవార్త:



గత ఏడాది అక్టోబర్ 9న టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ సిఎం జగన్ దిష్టిబొమ్మదగ్ధం చేసిన ఘటనలో తెలుగుయువత నేతలపై హత్యాయత్నంకేసు నమోదు చేసి వేధించిన వారినుండి మంగళవారం న్యాయస్థానం ముందస్తు బెయిల్ ఇవ్వడంతో విముక్తి కలిగింది. తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధులు ఎం.శేషాద్రినాయుడు,రామ్మోహన్‌లపై గతంలో 307 సెక్షన్ క్రింద యూనివర్సిటీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఐదునెలలుగా వీరిపై నమోదైన నేరారోపణ నుండి అదనపు జిల్లా జడ్జి ముందస్తు బెయిల్ మంజూరుచేయడంతో యూనివర్సిటీ పోలీసుస్టేషన్ నుండి ఇద్దరు సాక్షులతో బెయిల్ మంజూరైంది. ఈ సందర్భంగా తెలుగుయువత నేతలను సుగుణమ్మ ,నరసింహయాదవ్, ఆర్‌సి మునికృష్ణ, బుల్లెట్‌మణ,మధు, భాస్కర్‌యాదవ్, చిన్నబాబు,పార్టీ న్యాయవాది దినకర్ పరామర్శించారు.

## జయహో బి.సిల సంఘ సమావేశాన్ని జయప్రదం చేయండి

కార్వేటినగరం,ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:



కార్వేటినగరం తెలుగుదేశంపార్టీ కార్యాలయం నుండి గురువారం ఉదయం 10గంటలకు జాతీయ రహదారిలో ర్యాలీగా బయలుదేరి హిందూ,ముస్లీం కళ్యాణమండపం చేరుకుంటామన్నారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు రాష్ట్ర బిసి సెల్ అధ్యక్షులు కొల్లు రవీంద్ర,నియోజకవర్గ దేశంపార్టీ ఇన్‌చార్జి డాక్టర్ వి.యం.థామస్,చిత్తూరు పార్లమెంటు బి.సి సెల్ అధ్యక్షులు షణ్ముగరెడ్డి సూచనల మేరకు జయహో బి.సిల కార్యక్రమం జరుపనున్నట్లు నియోజకవర్గ బి.సి సెల్ అధ్యక్షులు మేళం రవియాదవ్ తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గ ఆరు మండలాల అధ్యక్షులు,ఆరు మండలాల బిసి.సంఘ అధ్యక్షులు,రాష్ట్ర,జిల్లా,నియోజకవర్గ,మండల,క్లస్టర్ ఇన్‌చార్జిలు, యూనిట్ ఇన్‌చార్జిలు,బూత్ కన్వీనర్లు,సెక్షన్ ఇన్‌చార్జిలు,పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చెవిరెడ్డి నోట్‌బుక్స్

చంద్రగిరి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులకు ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నోట్ బుక్స్ వితరణ చేశారు. మంగళవారం దోర్నకంబాల యంపిపి స్కూల్ విద్యార్థులకు ఎంఎల్ఏ సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యారంగాన్ని సమూల ప్రక్షాళన గావించి ఆధునిక విజ్ఞానాన్ని సముపార్జించుకునేందుకు అవసరమైన మౌళిక సదుపాయాలను కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిదే అన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకై నియోజకవర్గంలోని 395 పాఠశాలల్లో విద్యా భ్యాసం చేస్తున్న 23,150 మంది విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కల్లూరి కుసుమకుమారి, మాజీ ఎంపిటిసిలు పసల నాగరాజ, వరలక్ష్మి, వైసిపి విద్యార్థి విభాగంమండలఅధ్యక్షుడుసూరి,చంద్రగిరివార్డు మెంబర్ జ్యోతి ప్రసన్న నజరత్ తదితరులు పాల్గొన్నారు.

## రాయలపురం పంచాయతీ ప్రజలకు ఉపశమనం

మురుగునీటి కాలువ సమస్యపై స్టేషన్ ఎదుట ధర్నా

బడి సుధాయాదవ్ పోరాటంతో ఎంపిడిఓ హామీ

చంద్రగిరి, ఫిబ్రవరి 13 ప్రభాతవార్త:



రాయలపురం పంచాయతీ ప్రజల సమస్యకు ఓబిసి పోరం రాష్ట్ర కన్వీనర్ బడి సుధా యాదవ్ పోరాటంతో ఉపశమనం లభించింది. పంచాయతీ ప్రజలను సుధీర్ఘ కాలం పాటు వేధిస్తు న్న మురుగునీటి కాలువ సమస్యపై మంగళవారం ఆయన వెంకటంపేటకు చెందిన కిడ్నీ బాధితులతో కలసి పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. మురుగునీటి కాలువలో వ్యర్థాలను తొలగించి, శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ మూడు రోజుల క్రితం అధికారులకు వినతి చేశారు. అయితే అధికారుల నుండి సరైన స్పందన లేకపోవడంతో జెసిబిని ఏర్పాటు చేసి కాలువలో చెత్తను తీయించి మండల పరిషత్ కార్యాలయం ఎదుట పోయడానికి యత్నించడంతో సిఐ రామయ్య తమ సిబ్బందితో అడ్డుకున్నారు. ఈ క్రమంలో తీవ్ర వాగ్వివాదం చోటుకోవడంతో సమాచారం అందుకున్న ఎంపిడిఓ డాక్టర్ వి.వి.సూర్య సాయి ఘటనా స్థలికి చేరుకుని బాధితులను శాంతింపజేశారు. కాలువ శుభ్రం చేయించడంతో పాటు కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపుతానని హామీ ఇచ్చారు. దీంతో బడి సుధా యాదవ్ ఆందోళన విరమించారు.

